క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కు అందజేత


బాధితునికి చెక్కును అందజేస్తున్న కోట్రికె హరికిషన్

డోన్ : పట్టణానికి చెందిన అబ్దుల్ కరీంకు సీఎం సహాయ నిధి కింద రూ. 4 లక్షలు మంజూరైంది. ఈ మేరకు శుక్రవారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో బాధితుడు అబ్దుల్ కరీంకు మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్ చెక్కును అందజేశారు. సీఎం సహాయ నిధి పేదలకు అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా హరికిషన్ పేర్కొన్నారు.

పంటల పరిశీలన


మొక్కజొన్నను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ మోహన్‌రావు

బనగానపల్లె రూరల్ : మండలంలోని పాత పాడు పసుపల, చిన్నరాజుపాళెం గ్రామాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, కంది, పత్తి పంటలనుమండల వ్యవసాయశాఖ అధికారి సుబ్బారెడ్డితో కలిసి జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు పరిశీలించారు. రైతులతో కలిసి సాగు వివరాలపై మోహన్‌రావు ఆరా తీశారు. బనగానపల్లెను ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించడం జరిగిందని, పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేసిన వలంటీర్


లక్ష్మన్నకు నగదు అందజేస్తున్న వలంటీర్

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన మంటి లక్ష్మన్న ఆయాసంతో బాధపడుతూ కర్నూలు గవర్నమెంట్ ఆసుపత్రిలో 15 రోజులుగా చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ మధుసూదన్ కర్నూలు గవర్నమెంట్ ఆసుపత్రికి వెళ్లి శుక్రవారం పింఛన్ సొమ్ము అందజేశారు. వలంటీర్‌ను నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు అభినందించారు.

ఫాతెహాలు సమర్పించిన ఎమ్మెల్యే కాటసాని



ముస్లిం పెద్దలతో కలిసి ఫాతెహాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలోని ఖానాఖాలో దస్తగిరిస్వామి నెల సందర్భంగా గ్యార్మీ పండుగ పురస్కరించుకొని శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఫాతెహాలు సమర్పించారు. ఈ సందర్భంగా హజరత్ హఫీజుల్‌ను ఎమ్మెల్యే కాటసాని పూలమాల, దుశ్శాలువాతో సన్మానించారు. మతగురువుతో పాటు ముస్లిం పెద్దలు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మతపెద్దలు అల్తాఫ్‌హుస్సేన్, ముక్తియార్, ఖాసీంహుస్సేన్, నియాజీ, పర్వేష్, మహమ్మద్ అలి, అఫ్రిద్‌హుస్సేన్, అబ్దుల్‌రహీం రిజ్వాన్, నవబారత్ హుస్సేన్, అజ్జు పాల్గొన్నారు.

పట్టణంలో పోలీసుల కవాతు

డోన్ టౌన్ : పట్టణ పురవీధుల్లో శుక్రవారం సాయంత్రం పోలీసులు కవాతు నిర్వహించారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పాతబస్టాండ్, పాతపేట, కొత్తపేట, కొండపేట, ఇందిరానగర్, తారకరామనగర్, చిగురమానుపేట తదితర కాలనీల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లోని ప్రధాన కూడళ్లలో సీఐ మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మట్కా, పేకాట, నాటు సారా, గంజాయి లాంటి వాటి జోలికి వెళ్తే జైలుకు పంపడంతో పాటు రౌడీ షీట్ తెరుస్తామని హెచ్చరించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుని కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : ప్రమాదవశాత్తు మరణించిన లారీ డ్రైవర్ చింతలపేట గ్రామనివాసి శ్రీనివాసులు కుటుంబానికి జిందాల్ కంపెనీ, లారీ యజమాని తిమ్మారెడ్డి సహకారంతో రూ.13లక్షల 36వేల చెక్కును శుక్రవారం డోన్ లారీ, మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరాం చేతుల మీదుగా అందజేశారు. కొద్దిరోజుల క్రితం శ్రీనివాసులు అనంతపురం జిల్లా బొమ్మన హాల్ మండల పరిధిలోని జిందాల్ ఫ్యాక్టరీలో అన్‌లోడ్ చేసేందుకు వెళ్లి ప్రమాదంలో మృతి చెందాడు. ఈ మేరకు జిందాల్ కంపెనీ రూ.11లక్షలు, లారీ యజమాని రూ.2.36లక్షలను అందించినట్లు శివరాం తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బారెడ్డి, శివరంగస్వామి, మహనంతి, గోపాల్, ఘనమద్దిలేటి పాల్గొన్నారు.



చిన్నమల్కాపురం నిర్మించిన ఒకటవ సచివాలయ భవనం, రైతుభరోసా కేంద్రం



ఆర్‌ఎస్ మల్కాపురం నిర్మించిన రెండవ సచివాలయం భవనం, రైతుభరోసా కేంద్రం -2

పల్లెలకు పట్టణ శోభ!

- ప్రభుత్వ కార్యాలయాలతో కళకళలాడుతున్న గ్రామాలు
- అభివృద్ధి బాటలో మేజర్ గ్రామ పంచాయతీ చిన్నమల్కాపురం
- ముస్తాబైన ఆర్‌బీకే, సచివాలయ భవనాలు
- రేపు ప్రారంభించనున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ : జాతిపిత మహాత్మా గాంధీ కలలను గ్రామ స్వరాజ్యాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాకారం చేస్తుంది. ప్రజల వద్దకే పాలన లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు అందరి మన్ననలు పొందుతున్నాయి. ప్రజలకు నేరుగా సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలతో పల్లెల్లో పట్టణ శోభ సంతరించుకుంది. గ్రామాలు ప్రభుత్వ కార్యాలయాలతో కళకళలాడుతున్నాయి. అయితే గత ప్రభుత్వం గ్రామాలను నిర్లక్ష్యం చేసింది. పేరు గొప్ప... అభివృద్ధి శూన్యం అన్నట్లుగా ఉన్న డోన్ మండలంలో ఏకైక మేజర్ గ్రామ పంచాయతీ చిన్నమల్కాపురం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి బాట పట్టింది. ఈ పంచాయతీ పరిధిలో చిన్నమల్కాపురంతోపాటు పెద్దమల్కాపురం, వలసల, ఆర్‌ఎస్ మల్కాపురం గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల పరిసర ప్రాంతాలలో అపారమైన ఖనిజ నిక్షేపాలు ఉన్నందున డోలమైట్, చిప్స్ ఫ్యాక్టరీలు వెలసినప్పటికీ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కరువే. ఐదు వేల జనాభా, 4,155 మంది ఓటర్లున్నా గతంలో పాలకులు పట్టించుకోలేదనే విమర్శలు ఎక్కువే. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ గ్రామం అభివృద్ధి బాట పట్టింది. ప్రత్యేకించి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో గ్రామం పట్టణంలా మారింది. ఈ పంచాయతీలో సుమారు రూ.4కోట్లతో మంత్రి బుగ్గన అభివృద్ధి పనులు చేపట్టారు. చిన్నమల్కాపురం, ఆర్‌ఎస్ మల్కాపురం గ్రామాల్లో ఒక్కో భవనానికి రూ. 45 లక్షలు వెచ్చించి రెండు సచివాలయాలను నిర్మించారు. అదేవిధంగా రూ. 76 లక్షలతో రెండు రైతుభరోసా కేంద్రాలు నిర్మించారు. ఈ మేరకు పూర్తయిన నూతన భవనాలతోపాటు వీటి నిర్మాణానికి రూ. కోటి స్థలాన్ని విరాళంగా అందజేసిన దివంగత బుగ్గన సుదర్శన్‌రెడ్డి, దివంగత బుగ్గన సునిల్‌కుమార్‌రెడ్డి విగ్రహాలను ఈ నెల 5వ తేదీన మంత్రి బుగ్గన ప్రారంభించనున్నారు.


వలసెల గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు

గ్రామాభివృద్ధికి తమవంతు తోడ్పాటు



మా గ్రామం అభివృద్ధికి తమవంతు తోడ్పాటు అందజేస్తున్నాం. రైతుభరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం, సచివాలయాల నిర్మాణాలకు తమ కుటుంబ సభ్యులు రూ.కోటి విలువ ఎకరా స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం చేస్తున్న కృషికి తమ తోడ్పాటును అందిస్తున్నందుకు గర్వంగా ఉంది. – బుగ్గన రాజేశ్వరరెడ్డి, ఉపసర్పంచ్, చిన్నమల్కాపురం.

రూ.కోటి స్థలం విరాళంగా ఇచ్చిన బుగ్గన వంశీకులు



స్థల దాతలు దివంగత సుదర్శన్‌రెడ్డి, సునిల్‌కుమార్‌రెడ్డి విగ్రహాలు

మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి వంశీకులు తమ దాతృత్వాన్ని చాటుకుంటూనే ఉన్నారు. చిన్నమల్కాపురం అభివృద్ధికి మాజీ సర్పంచ్ దివంగత బుగ్గన తిప్పారెడ్డి తనవంతు కృషి చేశారు. ఆయన కుమారుడు దివంగత బుగ్గన సుదర్శన్‌రెడ్డి, మనవడు దివంగత బుగ్గన సునిల్‌కుమార్‌రెడ్డి సైతం బుగ్గన తిప్పారెడ్డి బాటలోనే గ్రామాభివృద్ధికి తమవంతు సహకారం అందజేశారు. ప్రస్తుతం వారు లేనప్పటికీ బుగ్గన సుదర్శన్‌రెడ్డి, దివంగత సునిల్‌కుమార్‌రెడ్డి జ్ఞాపకార్థం గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించేందుకు రూ. కోటి విలువ చేసే ఎకర స్థలాన్ని బంధువులు విరాళంగా అందజేశారు. ఏకంగా రూ. కోటి స్థలాన్ని విరాళంగా అందజేసిన బుగ్గన వంశీకులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన దివంగత బుగ్గన సుదర్శన్‌రెడ్డి, దివంగత సునిల్‌కుమార్‌రెడ్డి విగ్రహాలను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదివారం ప్రారంభించనున్నారు.

మంత్రి బుగ్గన చొరవతోనే అభివృద్ధి



ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో మా గ్రామం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందింది. పంచాయతీ పరిధిలో రూ.2కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను చేపట్టాం. గతంలో ఏ ప్రభుత్వ హయాంలో కూడా ఇంతటి అభివృద్ధి జరగలేదు. నా హయాంలో గ్రామం పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగడం సర్పంచగా సంతోషపడుతున్నా. – లక్ష్మిప్రసన్న, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్, చిన్నమల్కాపురం

అన్నివిధాలా సహకారం



గ్రామాల అభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందజేస్తున్నాం. ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. త్వరలోనే వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి కనెక్షన్ ఇస్తాం. డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మంత్రి బుగ్గన చేస్తున్న కృషికి ప్రజలు అన్నివిధాలా సహకరిస్తున్నారు.
– రేగటి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ, డోన్ మండలం.

ఊహించని అభివృద్ధి



మా గ్రామానికి పారిశ్రామికంగా ఎంతో పేరుంది. అయినా ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. మేజర్ పంచయతీ అయినా కనీస మౌలిక వసతులు కరువు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఊహించని అభివృద్ధి జరిగింది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవ అభినందనీయం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు మంత్రి బుగ్గనకు ప్రత్యేక కృతజ్ఞతలు.
– బద్దల నాగరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు, చిన్నమల్కాపురం

మద్దతు ధరకే ధాన్యాన్ని విక్రయించుకోవాలి


నందవరం గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

బనగానపల్లె రూరల్ : రైతులు తమ ధాన్యాన్ని మద్దతు ధరకే విక్రయించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని నందవరం గ్రామంలో జొన్న పంట మద్దతు ధరపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జేసీ మాట్లాడుతూ ప్రైవేట్ వ్యాపారులకు జొన్న దిగుబడులకు ప్రభుత్వం చెల్లించే మద్దతు ధర కంటే తక్కువకు ఇవ్వవద్దని సూచించారు. ప్రభుత్వం సివిల్‌సప్లై శాఖ ద్వారా రేషన్‌కార్డు దారులకు జొన్నలను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. నంద్యాల జిల్లా నుంచే ఎక్కువ శాతం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందని, రైతుల ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సివిల్‌సప్లై అధికారి రాజు, ఏడీఏ రాజశేఖర్, ఏఓ సుబ్బారెడ్డి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు తులసిశ్వరరెడ్డి, పీఆర్ మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్ కుమార్

డోన్ టౌన్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ సూచించారు. ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేసినప్పుడే జీవితానికి సార్థకత ఏర్పడుతుందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పాలం సుజాత రెడ్డి, 13వ వార్డు కౌన్సిలర్ దినేష్ గౌడ్, ప్రిన్సిపాల్ కృష్ణయ్య పోటీ పరీక్షలు, విద్యా, ఉద్యోగ అవకాశాలపై అవగాహన విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా నాయకులు విజయ్ కుమార్, విజేత స్కూల్ కరస్పాండెంట్ సుబ్బు యాదవ్, జూనియర్ కళాశాల అధ్యాపకులు శ్రీధర్ రెడ్డి, ఓబులరావ్, చౌడప్ప, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన బోర్ల మరమ్మతులు


మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మనోహర్

డోన్ : నియోజకవర్గంలో రానున్న వేసవిలో ఎదురుకానున్న నీటి ఎద్దడిని ముందే అంచనా వేసి ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మనోహర్ అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన తాగునీటి ఎద్దడిపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి ఎద్దడిపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డోన్ మండలంలోని పశ్చిమ పల్లెలైన ఎద్దుపెంట, చనుగొండ్ల, ఇందిరాంపల్లె, కోట్రాయి, ప్యాపిలి మండలంలోని జలదుర్గం, నేరేడుచెర్ల, కలచట్ల గ్రామాలతో పాటు బేతంచెర్ల మండలంలోని అనేక గ్రామాలలో తాగునీటి సమస్య ఎదురుకాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతంలో యుద్ధప్రాతిపదికన బోర్లను మరమ్మతులు చేయడం, డిపనెంగ్, ఫ్రెస్సింగ్ చేయించడం జరగాలన్నారు. అవసరమైన చోట అధనంగా పైపులు వేసి ఇంకిపోయిన భూగర్భ జలాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో డోన్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ప్యాపిలి, బేతంచెర్ల ఎంపీడీఓలు ఫజుల్ రహిమాన్, దస్తగిరి బాబు, డోన్, ప్యాపిలి, బేతంచెర్ల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సతీష్, రవి, రాజశేఖర్‌రెడ్డి, ప్యాపిలి మండల జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరాం రెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వరరెడ్డి, వైఎస్ఆర్‌సిపి నాయకులు గజేంద్రనాథ్‌రెడ్డితో పాటు మూడు మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

భీమునిపాడులో చోరీ

కోవెలకుంట్ల: మండలంలోని భీమునిపాడు గ్రామంలో శుక్రవారం చోరీ జరిగింది. స్థానికుల సమాచారం మేరకు ఓబుళమ్మ, వెంకటేశ్వర్లు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. భార్య, భర్తలిద్దరూ పాఠశాలలకు వెళ్లగా ఓబుళమ్మ తల్లి లక్ష్మమ్మ ఇంటికి తాళం వేసి కూలిపనికి వెళ్లింది. గమనించిన గుర్తు తెలియని దుండగులు తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న 15 తులాల బంగారం ఆభరణాలు, రూ. 40 వేలు కాజేశారు. పాఠశాలకు వెళ్లిన ఇరువురు ఇంటికి తిరిగి రాగా తలుపు తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

నాటుసారా స్వాధీనం

సంజామల: మండల పరిధిలోని రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన టి.ప్రతాప్ నాటుసారా విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఐ ప్రతాప్ తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడి నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

డోన్ టౌన్ : పట్టణంలోని కొండపేటకు చెందిన షేక్ మదార్‌వలి, షేక్ మస్తాన్ వల్లిలను అదుపులోకి తీసుకొని కేజీ ఇరవై గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ శుక్రవారం తెలిపారు. బేతంచర్ల రోడ్డులోని సుంకలమ్మ గుడి సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జీ రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

నేడు గొర్విమానుపల్లెలో హెల్త్ క్యాంప్

కొలిమిగుండ్ల: గొర్విమానుపల్లె గ్రామ సచివాలయం పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్పెషలిస్టు డాక్టర్లు ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తారన్నారు. గొర్విమానుపల్లె, కొండమీదపల్లె గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

5 నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తుమ్మలపెంటలో ఈనెల 5,6 తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరై సంక్షేమ పథకాల అమలు తీరుతోపాటు ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరిస్తారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్య కాటసాని రామిరెడ్డి


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యపడుతుందని, ఆ దిశగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అవుకు–2 గ్రామ సచివాలయ పరిధిలో రెండవ రోజు శుక్రవారం మండపం వీధి, ఎస్సీ, అంబేద్కర్, కొత్తకాలువ ఏరియా, మూలమ్మ ఏరియా కాలనీల్లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, నాయకుడు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ముడియాల జయచంద్రారెడ్డి అధికారులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి వెళ్లిన ఎమ్మెల్యే అమ్మా బాగున్నావా.. అక్కా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన లబ్ధి వివరాలను బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. బుక్‌లెట్‌లోని వివరాల మేరకు సంక్షేమ పథకాలు అందాయా లేదా అని లబ్ధిదారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పల్లెల అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. గ్రామాల్లోనే పాలనను సులభతరం చేయటానికి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి సంక్షేమాన్ని ఇంటి ముంగిటకే చేరవేస్తున్నారని వివరించారు. ఇలాంటి పాలన కొనసాగించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని ఈ సందర్భంగా ప్రజలను ఎమ్మెల్యే కోరారు. వివిధ కాలనీల ప్రజలు సీసీ రోడ్లు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరగా సానుకూలంగా స్పందించారు. వెంటనే నివేదికలు తయారు చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, ఈఓఆర్డీ రామక్రిష్ణవేణి, పశువైద్యాధికారిణి భారతీదేవి, ఏపీఓ అనీఫా, ట్రాన్స్‌కో, పీఆర్ ఏఈలు పక్కీరయ్య, వెంకట రమణ, మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి అశ్విన్ కుమార్, ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, అవుకు పట్టణ బలిజ సంఘం అధ్యక్షుడు రామన్న, నాయకులు వాయునంద గౌడ్, మద్దిలేటి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతికి ఎమ్మెల్యే సంతాపం

అవుకు: స్థానిక తెలుగుపేటకు చెందిన నాల్గో తరగతి చదువుతున్న శేగు లిఖిల్(10) బోన్ క్యాన్సర్‌తో ఐదు నెలలుగా బెంగుళూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఎమ్మెల్యే కాటసానితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి బాలుడి మృత దేహంపై పూలమాలను వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు అధైర్య పడొద్దని ధైర్యం చెప్పారు. అదేవిధంగా మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంనాథ్ రెడ్డి, నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ముడియాల జయచంద్రారెడ్డి నివాళులర్పించారు.

చల్లాకు నివాళి


దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, చల్లా కుటుంబసభ్యులు

అవుకు: దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థానిక చల్లా ఫామ్ హౌస్‌లో ఆయన సమాధికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో పాటు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, చల్లా రామేశ్వర రెడ్డి, వైఎస్సార్ సీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ముడియాల జయచంద్రారెడ్డి, యువ నాయకులు చల్లా చైతన్య రెడ్డి, చల్లా చరణ్ రెడ్డి, చల్లా విక్రాంత్ రెడ్డి, చల్లా హిమకర్ రెడ్డి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భర్త జ్ఞాపకాలను స్మరించుకొని చల్లా శ్రీలక్ష్మి కన్నీటి పర్యంతమయ్యారు. ఎమ్మెల్యే కాటసాని చల్లా శ్రీలక్ష్మీతోపాటు ఆమె కుమారులు చల్లా రాజ్యాభిషేక్ రెడ్డి, జూనియర్ చల్లా రామక్రిష్ణా రెడ్డిని ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, చల్లా అభిమానులు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం గ్రామానికి చెందిన పిక్కిలి కంబగిరి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను శుక్రవారం మృతుని భార్య తిరుపాలమ్మకు సచివాలయ పంచాయితీ కార్యదర్శి నరేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ లావణ్యదేవి అందజేశారు.
ప్యాపిలి: మండల పరిధిలోని కలచట్ల గ్రామానికి చెందిన పూల చిన్న పుల్లమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె భర్త పూల తిరుపాలుకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ. 10 వేలను వైఎస్సార్ సీపీ నాయకులు నాగరాజు, రామ్మూర్తి, జయరామయ్య, బాలాంజి తదితరుల చేతుల అందజేశారు.

నేడు నందివర్గంలో హెల్త్ క్యాంప్

బనగానపల్లె : మండలంలోని నందివర్గం గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. డాక్టర్లు ఫెరోజ్, సోహెల్‌బాబు తదితరులు ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేస్తారని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కూలిన ఏళ్లనాటి చింత చెట్టు


రోడ్డుపై కూలిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు ప్రక్కలో ఉన్న ఏళ్లనాటి చింత చెట్టు శుక్రవారం తెల్లవారు జామున వీచిన గాలి కారణంగా కూలింది. దాదాపు 70–80 ఏళ్లనాటి వృక్షం రోడ్డుపై పడడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సర్పంచ్ బండివరలక్ష్మీ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బండి బ్రహ్మానంద రెడ్డి విషయాన్ని విద్యుత్ శాఖ, ఆర్‌అండ్‌బీ అధికారులకు సమాచారం ఇచ్చి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. చెట్టు విరిగిన సమయంలో అక్కడ ఎవరు లేక పోవడంతో ప్రమాదం తప్పింది. అయితే చెట్టు కొమ్మలు ఓ ఇంటిపై పడడంతో గృహం పాక్షికంగా దెబ్బతింది.

జగనన్న ఆరోగ్య వైద్య శిబిరానికి విశేష స్పందన


మహిళ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న వైద్యులు

బనగానపల్లె : మండలంలోని యనకండ్ల గ్రామంలో శుక్రవారం ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. వైద్యులు ఫిరోజ్, సోహెల్‌బాబు, మంగ్యానాయక్ తదితర వైద్య సిబ్బంది 1,010 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, సాంబశివారెడ్డి, సంజీవరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఎంపీహెచ్ఈఓ సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ప్రసాద్ బాబు

అవుకు: అవుకు మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పోతుల ప్రసాద్ బాబును నియమిస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు నవంబర్1 నుంచి ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరయ్యారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పోతుల ప్రసాద్ బాబునుఉన్నతాధికారులు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.